# కీలుబొమ్మ

ఐతా చంద్రయ్య , Siddipet, AP

'ఏమోయ్ శైలూ! ఇలారా!'

వేళ కాని వేళ భూపాలం పాడినట్టు ఇదేం పిలుపో!

రవిచంద్ర పిలుపు శైలజ కేమాత్రం నచ్చలేదు. పైగా ఒంటిమీద తేళ్ళూ, జెర్రులు పాకినట్లనిపించింది. కానీ... ఎంతైనా భర్త గదా! చేతులు కొంగుకు తుడుచుకుంటూ వంటింట్లోంచి బయటికొచ్చింది. నెలవంకలాగున్న నుదురు మీద ముంగురులు గాలికి కదులుతున్నాయి.

'ఇదేమిటో చూడు!' భర్త చేతిలో పాకెట్టు. అయిష్టంగా అందుకుని వెనక్కు తిరగబోయింది.

'విప్పి చూడోయ్!'

'మీరే విప్పుకోండి.'

'అబ్బా...ప్లీజ్...విప్పి చూడు శైలూ!' రవిచంద్ర గొంతులో మార్దవం.

గబగబా విప్పేసింది. చీర...గులాబిరంగు పట్టు చీర. కాఫీ కలర్ పూవుల అంచు...అదరగొట్టేలాగుంది. గులాబి రంగంటే అతనికెంతో ఇష్టమని చెప్పాడోసారి. చీర విప్పి భుజమ్మీద వేసుకోవాలన్పించింది, కాని...కాని... నిశ్చల సముద్రంలో తుఫానులా – మనసులో గందరగోళం.

'ఇప్పుడెందుకూ?' అడిగింది గంభీరంగా. ముక్కుపుడక తళుక్కుమంది.

కొత్తచీర కనబడగానే పెళ్ళాం ఎగిరి గంతేస్తుందనుకున్న రవిచంద్ర నీరుగారి పోయాడు. గోడకుర్చీ వేసిన విద్యార్థిలా మొహం వాడిపోయింది.

కొత్తచీరా, పూలూ, గాజులూ...ఇవేగదా ఆడదాన్ని లొంగదీసుకునే ఆయుధాలూ! కాని...ఈవిడ జడపదార్థంలాగుందే! ఏమైనా భార్యను ప్రసన్నం చేసుకోవాలీరోజు.

'ఎందుకేమిటోయ్! ఇవ్వాళ మీ శ్రీవారు పుట్టిన రోజు. నేను కొన్ని గంటల క్రితమే పుట్టాను శ్రీమతిగారూ!' జోకు తేలికై పోయింది.

ఒయ్, గీయ్...ఈ బుద్ధావతారానికి ఇదొక్కటే తక్కువైందా! నిన్నగాక మొన్న మూడు ముళ్ళేసినంత మాత్రాన అంత చనువా!

'మీ పుట్టిన రోజా! ఐతే ఏమిటటా?' భృకుటి ముడి పడింది. వంచిన రెండు విల్లుల మధ్య బాణంలా నల్లని కనుబొమ్మల మధ్య బాదాం గింజంత ఎర్రని కుంకుమ బొట్టు మెరిసింది.

'ఏమిటేమిటి? సాయంత్రం నేనాఫీసు నుండి వచ్చేసరికి నువ్వీ చీరలో రెడి గుండాలి...'

బయలుదేరాడండి మొనగాడు.

'ఎందుకటా?'

'గుడికెళ్ళి పూజ చేయిద్దాం. అట్నుంచటే సినిమాకెల్దాం సరదాగా.' చెంపలందుకోవాలని అతని చేతులు పైకి లేచాయి కాని ఒడిశెల గుండును తప్పుకుంటున్నట్టు చటుక్కున పక్కకు జరిగింది.

అతని పుట్టిన రోజునాడు అతని కిష్టమైన చీర నేను కట్టుకోవాలా? నేనేమన్నా కట్టు బానిసనా... నా మీద ఎందుకంత అధికారం? ఒళ్ళు మండింది. మూతి మూడు వంకర్లు తిప్పి చీరను దండెమ్మీదికి విసిరేసింది.

'అయ్యో...వంటింట్లో ఎలుకల గోల!' అంటూ గిరుక్కున వెనుదిరిగింది.

గుండెకు గుండుసూది గుచ్చుకున్నట్లనిపించింది రవిచంద్రకు. ఏమిటో ఈవిడ వాలకం! పెళ్ళై ఆర్నెల్లైంది. ఒక్కరోజన్నా మనసు విప్పి మాట్లాడిందా? అలసిపోయి ఆఫీసు నుండి వస్తుంటే ఎన్నడన్నా ఎదురొచ్చి కాఫీ కప్పు ందించిందా! పొడగాటి జడవేసుకుని, కళ్ళకు కాటుక పెట్టుకుని ఎప్పుడన్నా క్రీగంట చూచిందా! యాంత్రికంగా మెదుల్తుంది. ఇష్టం లేని పంజేస్తునుట్టు వంటజేసి టిఫన్ బాక్స్ అందిస్తుంది. ఇద్దరం కలిసి తిందామంటే కలియుగం మునిగి పోతున్నట్టు ఇదైపోతుంది.

అందచందాలు ఆడవాళ్ళ సొంతమేనని విర్రవీగుతున్న మేము నిన్ను జూచి అభిప్రాయం మార్చుకుంటున్నామనే వారు క్లాసులోని ఆడపిల్లలు. మరీవిడెందుకిలా ప్రవర్తి స్తుందో! లోకంలో కొత్తదంపతులంతా ఇట్లే ఉంటారా...ఉహూ

'సరే! సాయంత్రం రెడి గుండాలి సుమా!' అంటూ స్కూటర్ స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు.

జున్నుపాలలో పంచదార కలుపుకు తిన్నంత రుచిగా ఉంటాయతని మాటలు. ఛ్ఛీ... ఆ మాటలే అమ్మానాన్నల్ని బుట్టలో వేసుకున్నాయి. తనను పంజరంలో చిలకలా బంధించాయి. అదే... అతని స్థానములో మోహన్ వుంటేనా! జీవన బృందావనములో వేయి పున్నమ లొకసారి పూచేవి. అనురాగ సీమలో అభినవ మన్మథుడై అలరించేవాడు. మోహన్...అబ్బా...పాలలో తేనె కలుపుకు తాగినట్టు ఎంత తియ్యగుందా పేరు!

కండలు తిరిగిన శరీర సౌష్టవం, సామన ఛాయ, పొట్టేలు కొమ్ముల్లా వంకీలు తిరిగిన జుట్టు...అందర్నీ ఆకట్టుకునే చూపులు. ఆ చూపుల తూనీగలే తన మనసుకు గాలం వేసింది. కళాశాల వార్షికోత్సవములో మోహన్ ప్రవరాఖ్యుడు, తనువరూధిని... ఎంతసహజంగా సాగిందా నాటకం! ఇద్దర్నీ పాత్రల్లో జీవించారని ప్రసంసించారంతా.

అపురూపమైన అందచందాలతో, హొయలతో ప్రవరాఖ్యుణ్ణి తన పాదదాసునిగా చేసుకోవాలని వరూధిని ప్రయత్నం. అతని కౌగిలిలో కరిగిపోవాలని ఆరాటం. నటనలో తాను నిజంగా వరూధినిగానే మారిపోయింది. రిహార్సల్స్ వేసేప్పుడు ఎంత బాగా మాట్లాడేవాడు! ఎప్పుడూ తెల్లని డ్రెస్సులో పున్నమి చంద్రుడులా కనబడేవాడు. రోజంతా అతన్తోనే మాట్లాడాలనిపించేది. అతని ప్రేమ సామ్రాజ్యానికి పట్టపురాణి కావాలని ఉవ్విళ్ళూరేది మనసు.

నాటక ప్రదర్శన తర్వాత అతని గదికెళ్ళింది. అరమరికలు లేకుండా చాలా సేపు మాట్లాడుకున్నారు. చివరికి

'మోహన్! నాగురించి నీ అభిప్రాయమేమిటి?' అడిగేసింది. అప్పటికే బుగ్గలు సిగ్గులమయమైపోయినై.

'నీ గురించి చెప్పాలంటే నేనో కవినై పోవాలి శైలజా!'

అంటే'నవ్వొచ్చింది.

'నీ నవ్వు నయాగరా జలపాతం. మాటలు అమృతపు జల్లులు. ప్రాణం పోసిన అజంతా శిల్పంలాగుండే ఈ అప్సరసను పెళ్ళాడే వాడదృష్టవంతుడే!'

తన గుండె గులాబి వెయ్యి దళాలుగా విచ్చుకుంది. ఎదపూచిన గిలిగింతలు పెదవులపైకి పాకాయి. అతడు గొప్ప మొహమాటస్తుడిలాగున్నాడు. మనసులోని మాట సూటిగా బయటకు చెప్పలేకపోతన్నాడు. ఆ తర్వాత పరీక్షలు, సెలవులు.

సెలవులకు ఊరెళ్ళేముందు కాళ్ళు అప్రయత్నంగా అతని గదికి లాక్కెళ్ళాయి. అతణ్ణి వెంట తీసుకెళ్ళి అమ్మానాన్నలకు పరిచయం చెయ్యాలి. ఒసారి వాళ్ళూరెళ్ళి రావాలి. ఆ తర్వాత పెద్దవాళ్ళను రంగంలోకి దింపాలి. బుర్రలో ప్లాను సిద్ధమైంది. కాని అతడంతకు ముందు రోజే గది ఖాళీ చేసి వాళ్ళూరెళ్ళాడని ఇంటఓనరు చెప్పేశాడు. అతనికో ఉత్తరం రాసి పడేసి బస్సెక్కింది.

ఊరికొచ్చిన మర్నాడే బంధువుల పెళ్ళికి నల్లగొండ వెళ్ళాల్సి వచ్చింది. పెళ్ళైన మూడో రోజు...అక్కడే తనకు పెళ్ళి చూపులన్నారు. గుండె గుబగుబలాడింది. రక్తం పిండినట్లనిపించింది.

నో నో...వీల్లేదు. నా మానస సరోవరములో హంసలా తిరగాడుతున్న మోహన్ స్థానంలో మరొకర్ని ఊహించడమా! మోహన్ గురించి అమ్మానాన్నలకు వెంటనే చెప్పెయ్యాలి. కాని... అది బంధువుల ఇల్లు. ఎటుబొయ్యి ఎటొస్తుందో! ఎవరేమనుకుంటారో!

'వద్దు నాన్నా! నాకిప్పుడే పెళ్ళొద్దు.' అనేసింది.

అమ్మ నవ్వేసి,

'పిచ్చి శైలా! నిన్ను చూడబోయేదెవరో కాదు. మీ నాన్నగారి చెల్లెలు కొడుకే!' వీపు నిమిరింది.

'నాన్నకో చెల్లెలుందా?'

'ఆదేనమ్మా!' నాన్న అందుకున్నాడు. మా బాబాయి కూతురు. చిన్నప్పుడు ఆవిడా నేనూ కలిసి ఆడుకున్నాం. వాళ్ళిప్పుడి వూళ్ళోనే ఉన్నారు. నిన్న వాళ్ళింటికెళ్ళాను. గొప్ప సంప్రదాయం కుటుంబం. అబ్బాయి అందగాడు. బాగా చదువుకున్నాడు గూడా. మంచి ఉద్యోగముంది. ఇంటి వద్ద బోలెడు ఆస్తి ఉంది.'

'ఐనా సరే! నాకిప్పుడే పెళ్ళొద్దు.'

నాన్న మొహంలో రంగులు మారాయి.

'నీ కెప్పుడు పెళ్ళి చెయ్యాలో కనిపెంచిన మాకు దెల్సు. నోర్మూసుకుని తయారుకా. ఏమేవ్! ఒగంటలో వాళ్ళొస్తారు. అమ్మాయిని తయారు చెయ్!.'

నాన్నదదోరకం. తాననుకున్నది జరిగితీరాలంటాడు. లేకపోతే ఉన్నపళంగా ఇల్లు పీకి పందిరేస్తాడు.

పెళ్ళిచూపులైపోయినై. అమ్మాయి నచ్చిందని చెప్పేశారక్కడే.

ఇంటికెళ్ళగానే మోహన్ సంగతి నాన్నకు చెప్పి వాళ్ళూరు పంపించాలి. కాని... నాన్న ముందు నిల్చుండి మాట్లాడే ధైర్యం తనకుందా! తెచ్చుకోవాలి. ధైర్యం తెచ్చుకోవాలి. పెళ్ళి జీవితములో గొప్ప మలుపు. జీవిత భాగస్వామిని ఎన్నుకోవడమంటే చాక్లెట్ చప్పరించి నంత సులభ విషయం కాదు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు? ముందు అమ్మను ఒప్పించాలి. ఆ తర్వాత అమ్మ ద్వారా నాన్నను. ఈ పని అమ్మతో కాదంటే స్వయంగా నడుం బిగించాలి.

ఇంటికెళ్ళేసరికి మోహన్ పెళ్ళి పత్రిక వచ్చి పడుంది.

అసాధ్యం! అసంభవం!! ఈ పెళ్ళికి మోహన్ అంగీకరించి ఉండడు. వాళ్ళూరెళ్ళి అతన్తో స్వయంగా మాట్లాడాలి. శుభలేఖ మరోసారి చదివింది. అంతకు ముందు రోజే పెళ్ళి ఐపోయింది.

అయ్యో! మోహన్ మరొకరి సొంతమా! ఈ పాటికి మరో ఆడదాని కొంగు బంగార మయాడన్నమాట. ఆశల పందిరి కూలిపోయింది. గుండె నరాలు పెళ్ళెళ్మని పేలిపోయినై. నాన్న కింకేం చెప్పాలి? దుఃఖం పొంగుకొచ్చింది.

తలవంచుకుని రవిచంద్రతో మూడు ముళ్ళు వేయించుకోక తప్పలేదు. మరి మోహన్!.... మోహన్! నీ మొహన రూపం నా మనో ఫలకమ్మించి చెదిరి పోతుందా? మనసులు కలసిన మనం వేరొకరి జీవిత భాగస్వామిగా సుఖ పడగలమా?

వంటింట్లో ఎలుకల గోల ఎక్కువైపోయింది. సామానులు సర్దేసి వచ్చి మంచం మీద నడుం వాల్చింది. మనుషులకంటే జంతువులే నయం. వాటికి ప్రేమా, ఆరాధనా, మనసు గాయాలూ... ఏ బాధలూ లేవు.

టక్ టక్ టక్ టక్.. తలుపు తడుతున్నారెవరో.

గబ గబా వెళ్ళి తెరిచింది.

అరె! కలా నిజమా! మోహన్... నా మోహన్! కళ్ళు అరచేతులంతైనై. మొహం బంతి పూవులా విచ్చుకుంటుంది. వెంటనే సన్నని బాధ. పొత్తి కడుపులోంచి తన్నుకొచ్చిన బాధ గుండెల్ని తాకుతూ కళ్ళల్లో కొచ్చింది.

మోహన్ పక్కన మరో యువతి. వారిద్దర్ని దింపిన ఆటో తిరిగి వెళ్తుంది. అగాధం ఒడ్డున నిల్చుండి కిందకు చూస్తున్నట్లనిపించింది.

ఎప్పుడూ తెల్లని పాయజామా, తెల్లని నెహ్రూ షర్టులో మల్లె పూవులాగుండే మోహన్ రంగుల పాంటు, అడ్డ గీతల షర్టుతో... ఇన్‌షర్ట్‌తో సీతాకోక చిలుకలా గున్నాడేమిటీ? చకితురాలైంది.

లోపలికి రాగానే మోహన్ తన భార్య సుశీలను పరిచయం చేశాడు.

'సుశీల బాబాయి కొడుకు పెళ్ళి ఈ ఊళ్లోనే. ఉన్న పళాన లాక్కొచ్చింది.'అన్నాడు. ఎంత గొప్ప పంజేసిందో చూశావా! అన్నట్టు మొహం బెట్టి.

'మోహన్ నాకు మేన బావండి' అంది సుశీల భర్త కళ్ళలోకి సూటిగా చూస్తూ, ముసి ముసిగా నవ్వుతూ. ఆమె గుండెలమీద వేళ్ళాడుతున్న మంగళ సూత్రం జంట కొడలమీద ప్రవహించిన కాలువ కింద కలిసిలట్టుంది. వాళ్ళిద్దరి పెదాలమీది చిరునవ్వు చెదిరి పోవడం లేదు.

'మీవారు బాగున్నారా శైలజా?'అంటూ సూటుకేసు విప్పి పెళ్ళానికి బట్టలందించాడు.

'పెళ్ళివాళ్ళింట్లో జనాలెక్కువై పోయారండి. జానెడింట్లో మూరెడు కర్రలాగ ఇల్లు చిన్నది. చుట్టాలెక్కువై పోయారు. స్నానం చేద్దామంటే కుదరలేదు. ఇదిగో ఈ ఊళ్ళో మీరున్న సంగతి మా వారికి గుర్తుకొచ్చి లాక్కొచ్చారు. మీరు మా వారూ మంచి స్నేహితులట గదా!' అని బాత్రూంలోకి దూరిపోయింది సుశీల.

శైలజ కళ్ళు గంభీర ముద్ర దాల్చాయి. ఏం మాట్లాడాలో అర్థంకాక కొంతు బరువెక్కింది.

'నీ ఉత్తరాలకు జవాబివ్వలేదని కోపమా శైలజా? నీగ్గూడా పెళ్ళైంది గదా! నీ భర్త ఎలాంటి వాడో నాకు తెలీదాయె. నేన్రాసిన ఉత్తరం ఆయన చేతిలో పడితే ఎలాంటి అపార్థాలకు దారి తీస్తుందోనని రాయలేదంతే.'

'నవ్వూ... నువ్వు చాలా మారిపోయావు మోహన్.' మనసులోని మాట సెగలు గక్కుతూ బయట పడింది.

'మారాలిగదా! మన జీవితాల్ని పంచుకునే వారొచ్చాక తప్పదు గదా!'

చటుక్కున తలెత్తి చూచింది. తళ తళ లాడే కళ్ళు చెమ్మగిల్లి నిల్చుండి పోయినై. మోహన్ మొహంలో ఏ భావమూ కన్పించలేదు.

'నీ తెల్ల డ్రెస్సూ.'

'అది మా ఆవిడ కిష్టం లేదు.'

'అంటే... నువ్వు నీ పెళ్ళాం చేతిలో కీలుబొమ్మ వన్నమాట!'

'ఆమె నా చేతిలో తోలుబొమ్మ. నేనామె చేతిలో కీలుబొమ్మను. పెళ్ళాం మొగుడు ఒకరికి నచ్చినట్టు ఇంకొకరు తమ అలవాట్లను మార్చుకోవాలి గదా! సుశీల గూడా నాకిష్టం లేని బాబ్డ్ హెయిర్ మానేసి జడేసుకుంటుంది. నాకిష్టం లేదని పెదాలకు లిప్‌స్టిక్ రుద్దుకోవడం మానేసింది.'

'ఎందుకు చెయ్యాలట్లా?'

'అల్లా చెయ్యకపోతే కాపురం కొల్లేరవుతుంది. సంసారసాగరం సుడిగుండాల మయమై పోతుంది. మనశ్శాంతి కరువైపోతుంది. జీవితం నరకమైపోతుంది.'

'ఐతే మన మానసిక ఆందోళనకు మనమే కారణమంటావా మోహన్?'

శరీరమంతా వింత ప్రకంపనాలతో వణికిపోతుంది.

'నూటికి నూరు శాతం. మీవారెలాంటివారు?'

శైలజ అంతరంగము కాస్సేపు అల్లకల్లోలమైంది. ఆ తర్వాత స్థిరపడింది సరికొత్త నిర్ణయంతో ముఖారవిందము అందంగా విచ్చుకుంది.

'మావారు చాలా మంచివారు. నేనేం చేసినా సహిస్తారు. ఎలా మెదిలినా నవ్వేస్తారు.'

'ఐతే నీ సంసారం స్వర్గమే నన్నమాట.' అంటూ బాత్రూం నుండి బయటికొస్తున్న భార్య వెంట గదిలోకెళ్ళాడు.

శైలజ ఎదలో కొత్తగాలి వీస్తుంది. నరాల్లో కొత్త ఉత్సాహం పొంగుతూంది.

గంట తర్వాత మోహన్ దంపతులు వెళ్ళి పోయారు. ఐదయే సరికల్లా శైలజ గులాబిరంగు పట్టు చీర కట్టుకుని తయారైంది. రవిచంద్ర రాక కోసం గడపలో నిల్చుండి ఎదురు చూస్తుంది.

## సముద్రం ఘోష

ఉవెత్తున లేస్తున్న
కెరటాల సవ్వడి వింటున్న
మదిలో చేరి చేసిన
అల్లరులలో తలుస్తున్న
క్షణికానందం పొందుతున్న
ముసిముసి నవ్వుకుంటున్న
మల్లెకు తెలుసు తను
బ్రతికేది ఒక్క రాత్రేనని
కెరటానికి తెలుసు ఎంత
ఎత్తున ఎగిరిన ఆకాశాన్ని
అందుకోలేనని అయినా
మల్లె ఇస్తుంది కమ్మనివాసన
కెరటాలు ఇస్తాయి మనోవుల్లాసం
మమ్మల్ని చూడగానే
పలుకరించేవు కుశలమేనా!ని
ఆనందాన్ని పంచుకొనేవు
మేం ఇంటికి వెళ్ళేవేళ
దీనపు చూపులు విసిరేవు
నన్ను ఒంటిగ మిగల్చకు
ఓ నేస్తమా తోడుండమని.

--దూపాటి శేషకుమారాచార్యులు
Sarapaka, A.P.

## భద్రాద్రిలో శ్రీరామనవమి

భక్తుడు కోరినంతనే
శిరస్సుపై కాలుమోపినావు
విచక్షణ మరచి యాగానికి
ఆటంక కల్గించిన అసురలను
మధించి గురువులు ఆదరణకు
పాత్రులై చనే సీతనుచేపట్ట
నూనూగు మీసాల వాడు
చంద్రబింబం మోమువాడు
ధగధగ మెరయువర్చస్సు
విరచే నిండుసభలో శివధనస్సు
ఓరగాచూసే అజననివంక
పులకించిన తనవుతోడ
సీతను చేపట్టిన శుభవేళ
వాడవాడల వేడుకజరిపే
శ్రీరామ నవమి వేడుకలు

--దూపాటి శేషకుమారాచార్యులు
Sarapaka, A.P.

